ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 చిత్తూరు జిల్లా వార్తలు
బుధవారం 16 అక్టోబరు 2024



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755





చంద్రబాబు పర్యటన సమయంలో క్వారీ బండలతో నిండుగా కనిపిస్తున్న క్వారీలోని ఓ ప్రాంతం - క్వారీ బండలు తరలిపోగా ఖాళీగా కన్పిస్తున్న సి.బండపల్లె క్వారీలోని ఆ ప్రాంతం

సి.బండపల్లె క్వారీల్లో గ్రానైట్ ఖాళీ!

'మనమే గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళ్లాం. వైసీపీ నేతల అక్రమ క్వారీలు ఆపించాం. మళ్లీ మీలో కొందరు అదే పని చేస్తున్నారని నా దగ్గర సమాచారముంది. మనలను ప్రజలు గమనిస్తున్నారు. అటువంటి పనులు చేసినందుకే వైసీపీని ఇంటికి పంపి మనకు అధికారం ఇచ్చారు. మీలో ఎవరైనా అక్రమ క్వారీయింగ్‌కు పాల్పడినా, రవాణా చేసినా ఏమాత్రం ఉపేక్షించేది లేదు. అటువంటివారికి పార్టీలో పుట్టగతులుండవు, జాగ్రత్త'..... గత నెలలో కుప్పం నియోజకవర్గ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు జరిపిన టెలికాన్ఫరెన్సు ముఖ్య సారాంశమిది.

'నియోజకవర్గంలో కొంతమంది మన నాయకులు అక్రమ క్వారీయింగ్‌కు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కావాలంటే న్యాయబద్ధంగా ఏదైనా చేసుకోండి. నేను, పార్టీ అండగా ఉంటాం. అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఊరుకునే పరిస్థితి లేదు. జాగ్రత్త. ప్రజలకు కూడా చెబుతున్నా. మా నాయకులే కాదు, అక్రమాలకు పాల్పడితే నన్నైనా సరే చొక్కా పట్టుకుని నిలదీయండి'.... కుప్పం నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఇటీవల జరిగిన విలేకరుల సమావేశంలోనూ, అంతకుముందు పార్టీ అంతర్గత సమావేశంలోనూ చేసిన హెచ్చరికలివి.

యథేచ్ఛగా పొరుగు రాష్ట్రాలకు తరలింపు

నాడైనా నేడైనా 'అధికార' నేతలదే హవా

మైనింగ్ శాఖ మౌనం

కుప్పం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):అధినేత మాటలు అధినేతవే.. మా చేతలు మావే అన్నట్లుగా తయారైంది కుప్పం నియోజకవర్గ నేతల పరిస్థితి. క్వారీలనుంచి క్వారీ బ్లాక్‌లు అక్రమంగా పొరుగు రాష్ట్రాలకు యథేచ్ఛగా తరలుతున్నాయి. మరీ ముఖ్యంగా గుడుపల్లె, శాంతిపురం మండలాల పరిధిలోని క్వారీలనుంచి రోజూ అక్రమ క్వారీ వాహనాలు పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలకు బారులు తీరుతున్నాయి. పోలీసులు వీలున్నప్పుడు పట్టుకుని స్టేషన్లకు తరలిస్తున్నారు. మైనింగ్ అధికారులు పూర్తిగా తమ బాధ్యతను విస్మరించి జోగుతున్నారు.

2019లో వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలోని అక్రమార్కులు విజృంభించారు. ఒకరిద్దరు నాయకులు నియోజకవర్గంలోని క్వారీల మీద ఏకఛత్రాధిపత్యం వహించి, అధికారికంగా నడుస్తున్న గ్రానైట్ క్వారీల యాజమాన్యంనుంచి కప్పం కట్టించుకున్నారు. అక్రమ క్వారీయింగ్‌కు అభయం ఇచ్చారు. మరోవైపు మైనింగ్ అధికారులు నాటి అధికార పార్టీ నేతలతో అంటకాగి ప్రేక్షక పాత్ర పోషించారు. ఫలితంగా ఎటువంటి అనుమతులూ లేకనే గ్రానైట్ క్వారీలు వందల్లో నడిచాయి. రోజూ క్వారీలనుంచీ గ్రానైట్ బ్లాక్‌లు బండలు మూపున మోస్తూ, అక్రమ కంటైనర్లు, లారీలు పొరుగు రాష్ట్రాల బాట పట్టాయి. పంచాయతీ, మున్సిపల్, చివరకు శాసన సభ ఎన్నికలు కూడా ఈ అక్రమ క్వారీయింగ్ సొమ్ముమీదనే జరిపేశారు వైసీపీ నాయకులు. వారి అరాచకాలు, అక్రమాలు, అవినీతి చర్యలకు రోసిన ప్రజలు అధికార పీఠం నుంచి వైసీపీని పడదోసి, టీడీపీని అందలం క్కించారు. అయినా సరే, గ్రానైట్ బండల అక్రమ రవాణా ఆగడంలేదు. అధికార పార్టీకి తలనొప్పిగా మారిన ఈ వ్యవహారం అంతు ఎంతకీ తేలడంలేదు.

పనికిరాని బండలకు నెంబర్లు

కుప్పంలో వైసీపీ హయాంలో నడిచిన అక్రమ క్వారీయింగ్‌కు సి.బండపల్లె క్వారీలు నమూనాగా నిలిచాయి. శాంతిపురం మండలంలోని సి.బండపల్లె పంచాయతీ చుట్టుపక్కల పంచాయతీల పరిధిలో సుమారు 20 దాకా గ్రానైట్ క్వారీలు అప్పట్లో అక్రమంగా నడిచాయి.ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు 2022 జనవరి నెలలో సి.బండపల్లె క్వారీకి కాలినడకన వెళ్లారు. ఆయన వెళ్లేసరికి అక్రమార్కులు ఎవరూ కనిపించలేదు కానీ, యథేచ్ఛగా సాగిన అక్రమ క్వారీయింగ్ కళ్లకు కట్టింది. దీనిపై గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటి మైనింగ్ శాఖ ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. కదిలిన గ్రీన్ ట్రిబ్యునల్ ప్రతినిధులు సి.బండపల్లె క్వారీని పరిశీలించి, సీజ్ చేయమని ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు సీజ్ చేసిన మైనింగ్ అధికారులు, అప్పటికే తవ్వి ఎత్తిన గ్రానైట్ బ్లాక్‌లకు నెంబర్లు వేసి అక్కడినుంచి తరలించడానికి వీలులేదని నిషేధం విధించారు. అయితే ఇక్కడే అధికారులు ఒక తిరకాసు చేశారు. వారు నెంబర్లు వేసి భద్రపరచమని చెప్పిన బండల్లో ముప్పావు వంతు పనికిరాని బ్లాక్‌లే.నెంబర్లు వేసివున్న బండల్లో చాలావరకు సి.బండపల్లె క్వారీ వద్దనే ఇప్పటికీ ఉన్నాయి. కారణం.. ఆ బండల్లో ఎక్కడో ఒక చోట చీలిక ఉండడం. లేదా ఏదోఒక డిఫెక్ట్‌తో రవాణాకు పనికిరాకపోవడం.

నాడు, నేడు ఆగని అక్రమ రవాణా



గుడుపల్లె మండలం పీజీ వాడ సమీపంలో పొరుగు రాష్ట్రాలకు తరలుతున్న అక్రమ క్వారీ కంటైనర్(ఫైల్ ఫొటో)

వైసీపీ హయాంలో సగం గ్రానైట్ బ్లాక్‌లు తరలిపోగా, తర్వాత టీడీపీ అధికారంలోకి వచ్చాక మిగిలినవి కూడా అక్రమ మార్గాలలో పొరుగు రాష్ట్రాలు చేరాయి. ఒక్క సి.బండపల్లె క్వారీనుంచే కాదు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల క్వారీలనుంచీ నాడు, నేడు కూడా అక్రమంగా గ్రానైట్ దిమ్మెలు తరలిపోతున్నాయి. నిన్నమొన్నటిదాకా అధికార యంత్రాంగం ఈ గ్రానైట్ బ్లాక్‌ల అక్రమ రవాణా విషయంలో పూర్తి ప్రేక్షక పాత్ర వహించింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని హెచ్చరించిన తర్వాత అక్కడక్కడా అక్రమంగా గ్రానైట్ బ్లాక్‌లు తరలిస్తున్న భారీ వాహనాలను పోలీసులు సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగిస్తున్నారు. మైనింగ్ అధికారులు ఏమి చేస్తున్నారో, అసలు వారు ఉన్నారో లేదో కూడా తెలియని పరిస్థితులు కుప్పం డివిజన్‌లో నెలకొన్నాయి. ఎక్కడికక్కడ మండలాలలో అధికార పార్టీ నాయకులే అక్రమ రవాణాకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటువంటి అక్రమాలు, అవినీతి చర్యలు వద్దని హెచ్చరిస్తున్నా, ఆయన సొంత నియోజకవర్గంలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ క్వారీయింగ్, అక్రమ రవాణాలు నేతలు, అధికారుల అలక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తున్నాయి. ఇకమీదటైనా ఈ అక్రమ క్వారీ దందాకు చెక్ పెట్టకపోతే, ప్రజలలో ప్రభుత్వ ప్రతిష్ఠ పలుచన అయ్యే ప్రమాదం ఉంది.



నెంబరు వేసిన బండపై కనిపిస్తున్న చీలిక



పనికిరాని క్వారీ బండపై కనిపిస్తున్న నెంబర్

నాణ్యమైన బండలన్నీ మాయం

నాణ్యత లోపించిన క్వారీ బండలకు నెంబర్లు వేసి, రవాణాపై నిషేధం విధించిన మైనింగ్ అధికారులు, నాణ్యమైన బ్లాక్ మార్కెట్‌లో మంచి ధర పలికే గ్రానైట్ బ్లాక్‌లను మాత్రం అలాగే వదిలేశారు. గ్రీన్ ట్రిబ్యునల్ ప్రతినిధులు వచ్చిన వెళ్లిన ఒకటి రెండు నెలలపాటు సి.బండపల్లె క్వారీతోపాటు ఆ చుట్టుపక్కల ఉన్న గ్రానైట్ క్వారీలలో ఎటువంటి అక్రమ కార్యకలాపాలు చోటు చేసుకోలేదు. అయితే ఆ తర్వాత అక్రమ క్వారీయింగ్ తిరిగి ప్రారంభం కావడమే కాకుండా, క్వారీలోని గ్రానైట్ బ్లాక్‌లు మాయం సాగాయి. అంటే యథేచ్ఛగా పొరుగు రాష్ట్రాలకు అక్రమంగా తరలివెళ్లాయి. వైసీపీ నేతల కనుసన్నల్లో ఈ అక్రమాలు జరిగాయి. చంద్రబాబు పర్యటించిన సమయంలో క్వారీ నిండుగా కనిపించిన క్వారీ బండలు, ఇప్పుడు ఒక్కటి కూడా ఇక్కడ లేవు. అంటే నాణ్యమైనవిగా మైనింగ్ అధికారులు, కావాలనే తప్పుడు నిర్ధారణ చేసి నెంబర్లు వేసిన ఎందుకూ పనికిరాని గ్రానైట్ బ్లాక్‌లు అలాగే క్వారీలో మిగిలిపోగా, మిగిలిన బ్లాక్‌లను అక్రమార్కులు యథేచ్ఛగా తరలించేస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడా క్వారీలకు అనుమతులు లేవు. అయినా సరే, యథేచ్ఛగా రవాణా సాగుతోంది.

నేడు, రేపు భారీ వర్షాలు



యాదమరి మండలంలోని జోడిచింతల సబ్‌స్టేషన్ వద్ద.. గుంతలతో చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి

వారపు సంతకు వాన కష్టాలు

వెదురుకుప్పం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):వెదురుకుప్పం వారపు సంత రోడ్డుపైనే జరగడం వల్ల వర్షంతో క్రయ, విక్రయదారులకు కష్టాలు తప్పలేదు. వెదురుకుప్పం మండల కేంద్రంలో ప్రతి మంగళవారం వారపు సంత జరుగుతున్నా కనీస వసతులు లేవు.వెదురుకుప్పం-తిరుపతి రహదారిపై రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో వాహనాల తాకిడి ఎక్కువగానే ఉండడం వల్ల చిరువ్యాపారులకు ఇబ్బందిగానే వుంటోంది. వారపు సంత రోడ్డుపై జరుగుతోందన్న సాకుతో చిత్తూరు రెండవ డిపోకు చెందిన బస్సులు వెదురుకుప్పానికి (తిరుపతి, చిత్తూరు వయా దేవళంపేట మీదుగా వెళ్లే సర్వీసులు) మంగళవారం రాకుండా సుమారు అర కి.మీ దూరం నుంచే వెళ్తున్నాయి. సంత జనం తాకిడి వల్ల లోపలకు రావడం లేదని చెబుతున్నారు. అర కి.మీ దూరం నుంచే వెళ్లడం వల్ల వృద్ధులకు, దివ్యాంగులకు పాట్లు తప్పడం లేదు.



● సెలవుపై వెళ్లిన అధికారులను వెనక్కి రమ్మన్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధ, గురువారాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులను అలర్ట్ చేశామని, హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని ఆదేశించినట్లు చెప్పారు. సెలవులో వున్న అధికారులందరూ వెంటనే విధులకు హాజరుకావాలని సూచించామన్నారు. రెవిన్యూ, పోలీసు సహా అన్ని శాఖలనూ సమన్వయం చేసుకుని పనిచేసేవిధంగా ఆదేశాలు జారీచేశామని వివరించారు. ప్రజలు కూడా అవసరమైతే తప్ప ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ప్రతి మూడు గంటలకొకసారి మండలాల నుండి నివేదికలు తీసుకుంటున్నామని వివరించారు. జాతీయ రహదారుల్లో భారీ వర్షాల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని రవాణాశాఖ అధికారులను ఆదేశించామని చెప్పారు. పంటల ఉత్పత్తులకు నష్టం వాటిళ్ళకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వ్యవసాయ శాఖ ద్వారా రైతులను అప్రమత్తం చేశామని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిస్థితులపై అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. జిల్లాలో పెద్ద జలాశయాలు లేకున్నా, ఉన్న చోట్ల అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించామని ఆయన వివరించారు.

కంట్రోల్ రూముల ఏర్పాటు

తుఫాన్ సహాయక చర్యల నిమిత్తం కంట్రోలు రూములను ఏర్పాటు చేశారు.కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబరు 94910 77356, ల్యాండ్ లైన్ నెంబరు 08572-242777; చిత్తూరు ఆర్డీవో కార్యాలయం కంట్రోల్ రూమ్ నెంబరు 94917 77011, కుప్పం ఆర్డీవో కార్యాలయ కంట్రోల్ రూమ్ నెంబరు 99660 72234, పలమనేరు ఆర్డీవో కార్యాలయం కంట్రోల్ రూమ్ నెంబరు 94910 74510, నగరి ఆర్డీవో కార్యాలయం కంట్రోల్ రూమ్ నెంబరు 97010 19083.

జిల్లాకు రూ.కోటి విడుదల

జిల్లావ్యాప్తంగా తుపాను సహాయక చర్యలు నిమిత్తం ప్రభుత్వం మంగళవారం రాత్రి జిల్లాకు రూ. కోటి విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు డీఆర్వో పుల్లయ్య తెలిపారు. రెండ్రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వం అప్రమత్తం చేస్తూ సహాయక చర్యల నిమిత్తం జిల్లాకు రూ.కోటి విడుదల చేసిందని ఆయన వివరించారు.

జిల్లావ్యాప్తంగా వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్న కారణంగా జిల్లా అంతటా విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐరాల, గుడుపల్లె మండలాలు మినహా మిగిలిన 30 మండలాల్లో వర్షపాతం నమోదయ్యింది. అత్యధికంగా నింద్రలో 22.8మిమీ, అత్యల్పంగా తవణంపల్లెలో 1.0 మిమీ వర్షం కురిసింది. మండలాల వారీగా రొంపిచెర్లలో 12, సదుంలో 9.6, పులిచెర్లలో 16.2, వెదురుకుప్పంలో 4.4, విజయపురంలో 5.4, నగరిలో 8.6, కార్వేటినగరంలో 5.4, పెనుమూరులో 3.6, పూతలపట్టులో 8.6, సోమలలో 12.6, చౌడేపల్లిలో 5.4, పుంగనూరులో 6.2, పెద్దపంజాణిలో 11.4, గంగవరంలో 7.4, శ్రీరంగరాజపురంలో 16.4, గంగాధరనెల్లూరులో 10.8, చిత్తూరులో 9, పలమనేరులో 4.4, బైరెడ్డిపల్లిలో 3.6, వి.కోటలో 16.6, శాంతిపురంలో 2.2, కుప్పంలో 2, రామకుప్పంలో 5.2, బంగారుపాళ్యంలో 6.2, యాదమరిలో 9.4, గుడిపాలలో 19.2, పాలసముద్రంలో 12.6, చిత్తూరు రూరల్‌లో 11 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.



చిత్తూరులో వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

తీరు బాలేదు తమ్ముళ్లూ!



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ పరిస్థితిపై చంద్రబాబు అసంతృప్తి

చక్కదిద్దే పనిలో అధినేత

వివరాలు 6లో

ఆడవాళ్లకు మాత్రమే

డ్రైవింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్న సునీత

7లో



ఇన్‌చార్జి మంత్రిగా రామ్‌ప్రసాద్ రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వులిచ్చారు.

46 పంచాయతీల్లో పల్లెపండుగ

● రూ.2.42 కోట్లతో 68 పనులు ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 46 గ్రామ పంచాయతీల్లో మంగళవారం పల్లెపండుగలు నిర్వహించారు. రెండో రోజున రూ.2.42 కోట్లతో 68 పనులను ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. పూతలపట్టు మండలంలో ఐరాలలో నిర్వహించిన పల్లెపండుగలో ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొని రూ.4 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల పనులకు ప్రారంభోత్సవం చేశారు. జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు, డ్వామా పీడీ రవికుమార్ పాల్గొన్నారు. కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లె పీబీవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. మిగిలిన ప్రాంతాల్లోనూ స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈనెల 21వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.6.58 కోట్లతో 143 పనులు చేపట్టారు.

టెట్‌కు 293మంది హాజరు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్)కు మంగళవారం 293 మంది హాజరయ్యారు. జిల్లాలోని ఒకటి, చెన్నైలోని ఒక సెంటర్‌లో ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లో జరిగిన పరీక్షలకు 400 మంది అభ్యర్థులకుగాను 293 మంది హాజరుకాగా, 107 మంది గైర్హాజయ్యారు. ఉదయం సెషన్‌లో 200 మందికి 139 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 200 మందికి 154 మంది హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.



'తడవబాకరా నాయనా.. తల తడిస్తే పడిసెం జేస్తాది' అని వానలో ఆడే పిలకాయల్ని అమ్మ మందలిస్తూ ఉంటుంది. వకుళమాత కోపం గుర్తుకొచ్చిందేమో మరి.. మంగళవారం సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ ఊరేగింపు కోసం బయట కొచ్చిన స్వామి ఘటాటోపం కిందకి చేరుకున్నాడు. తల తడిస్తే పడిసెం మాకు మాత్రం పట్టదా అని ఏనుగులు మహాలక్ష్మి, పద్మజ కూడా పందిరి కిందకు చేరుకున్నాయి, తడవకుండా.

- తిరుమల,ఆంధ్రజ్యోతి



అర గంట నిలిచి కురిస్తే చాలు.. మాలాడగుండం దూకి పారుతుంది. కపిలతీర్థం కత చెప్పనే అవసరం లేదు. హోరెత్తుతుంది. రెండు రోజులుగా చిటుకూ పటుకూ మంటూనే ఉన్నా ఉలుకూపలుకూ లేకుండా ఉన్న మాలాడగుండంలో మంగళవారం సాయంత్రానికి సన్నని ధర మొదలైంది. చూరునీళ్లు కారినట్టుగా కనిపిస్తున్నా.. ఇదేవాన రాత్రికి కురిస్తే మాత్రం బుధవారం తెల్లారేసరికి ఉరకలెత్తి తిరుపతి నగరానికి కనువిందు చేస్తుంది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి



తిరుపతి మహానగరంగా మారిపోతున్నా.. శివారు ప్రాంతాలు మాత్రం పల్లె ఆచారాలను కాపాడుకుంటున్నాయి. జీవనకోనలో ఏటా జరిగినట్టే భారతాలు జరుగుతున్నాయి. జీవలింగేశ్వరస్వామి గుడిలో మంగళవారం గీతావాణి ఆడిపాడి చెప్పిన హరికథ జనాన్ని అలరించింది. ఈ నెల 27 దాకా మహాభారత ఉత్సవాలు ఇక్కడ ఘనంగా జరుగుతాయి.

-తిరుపతి (జీవకోన), ఆంధ్రజ్యోతి



మహాత్ముడి తర్వాత దేశ ప్రజలంతా ఆరాధించిన నేత ఏపీజే అబ్దుల్ కలాం. అంతరిక్ష ప్రగతిలో ఆయన పాత్ర గొప్పది. కలాం జయంతి సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు షార్ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ కె. నారాయణ. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచిస్తూ మంగళవారం సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

-సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

STREET FOOD

భలే భలే బజ్జీలు












ఇక్కడ దొరికే బజ్జీలు:
మిర్చి బజ్జీ, టమోటా, క్యాప్సికం, బీరకాయ, అరటికాయ, వంకాయ, ఉర్లగడ్డ, సీమవంకాయి, గెనిసిగెడ్డ, సొరకాయ, యాపిల్, జామ, పైనాపిల్, మామిడి కాయ.

ప్రత్యేకత:
బజ్జీలకు సన్‌ఫ్లవర్ ఆయిల్ వాడుతారు. ఒక రోజు వాడిన నూనె మిగిలినా మరుసటి రోజుకి వాడరు.

ఎన్ని ఛాట్‌లు వచ్చినా మన బజ్జీని కొట్టే మొనగాడు ఫుడ్ లేదు. మరీ కాస్త చినుకు రాలి చల్లబడితే మనసు బజ్జీ మీదకు పోతుంది. మిర్చి బజ్జీ, అరటికాయ బజ్జీ, ఉర్లగడ్డ బజ్జీ.. మనకు తెలుసుగానీ 15 రకాల బజ్జీలు దొరికే ఒక చోటు తిరుపతిలో ఉంది. రాములవారి ఉత్తర మాడవీధిలో ఈ బజ్జీల బండి దగ్గర సాయంత్ర సమయాల్లో జనం కిటకిటలాడుతూ కనిపిస్తారు. మరిగే నూనెలోంచి కాలేకాలే బజ్జీలు ప్లేట్‌లో పెట్టి.. ఎండుమిరపకాయలు, అలసందలు, ధనియాలు, చెనిక్కాయ పప్పులతో కూడిన మసాలాను ఆ బజ్జీలలో కూరి ఇస్తారు. ఫైనల్ టచ్‌గా నిమ్మ దబ్బ పిండుతారు. సురేంద్ర ఆరేళ్లుగా ఈ బండి నిర్వహిస్తున్నారు. - తిరుపతి (జీవకోన)

బండి సమయం: సాయంత్రం 4 నుంచి రాత్రి 9 దాకా

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి పట్ల చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల తీరుపై సమాచారం తెప్పించుకుంటున్న ఆయన జిల్లాలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దడం మీద దృష్టి పెట్టినట్టు చెబుతున్నారు.



తీరు బాలేదు తమ్ముళ్లూ!

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ పరిస్థితిపై చంద్రబాబు అసంతృప్తి
- చక్కదిద్దే పనిలో అధినేత

తిరుపతి, ఆంధ్రజ్యోతి

గత ఐదేళ్లూ ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వైసీపీ నేతలను మొక్కవోని స్థైర్యంతో ఎదుర్కొన్న టీడీపీ శ్రేణులు ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో పెద్ద ఎత్తున సంబరపడ్డాయి. అయితే వంద రోజులు కూడా గడవకమునుపే శ్రేణులు నిరుత్సాహానికి లోనయ్యాయి. పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వం వచ్చీరాగానే సంపాదనపై దృష్టి మళ్ళించారని, పార్టీ పటిష్ఠతను వదిలేసి దానికే తొలి ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. నిఘా వర్గాలతో పాటు పార్టీ పరంగానూ వేర్వేరు మార్గాల్లో అందిన సమాచారం ఆధారంగా జిల్లాలో ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, ఇంచార్జుల పనితీరును, వారి వ్యవహార శైలిని అధినేత చంద్రబాబు బేరీజు వేస్తున్నట్టు సమాచారం. ఎక్కువమంది ఎమ్మెల్యేలు పార్టీకోసం కష్టపడిన నాయకులను పట్టించుకోకుండా, తమకు అనుకూలురైన ఒకరిద్దరికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని, వారు చెప్పినట్టే వినాలని మండలస్థాయిలో అధికారులకు ఆదేశాలిస్తున్నారని అధినేతకు ఫిర్యాదులు అందాయి. ఇక శాసనసభలో ప్రమాణస్వీకారం చేసిన వెంటనే కొందరు ఎమ్మెల్యేలు ఇసుక మీద పడ్డారు. ప్రభుత్వ ఇసుక విధానం ఖరారు కాకముందే డంపుల్లో నిల్వవున్న ఇసుకను దౌర్జన్యంగా తెగనమ్మేసుకున్నారని అంటున్నారు. రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు. వైసీపీ నేతలు చేసిన భూ కబ్జా వ్యవహారాల్లో తలదూర్చి ఫిఫ్టీ: ఫిఫ్టీ పద్ధతిలో సర్దుడు బేరాలు మొదలు పెట్టేశారనే ఆరోపణలు ఉన్నాయి. తనకందుతున్న ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుంటున్న అధినేత ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు, ఇంఛార్జుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. శ్రేణులను విస్మరించడాన్ని ఆయన తీవ్రంగా పరిగణిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ ఎమ్మెల్యేలు లేని మూడు నియోజకవర్గాలకు గానూ రెండు చోట్ల ఇంఛార్జుల పనితీరుపై కూడా అధినేత అసహనంగా వున్నట్టు ఆ వర్గాలు చెబుతున్నాయి. ఓ నియోజకవర్గంలో ఇంఛార్జి పార్టీని గాలికొదిలేసినట్టు వ్యవహరిస్తుండడం, మరో చోట క్యాడర్ వాహనాల్లో అమరావతికి తరలివెళ్ళి ఇంఛార్జిపై ఫిర్యాదులు చేస్తుండడం పట్ల చంద్రబాబు సీరియస్‌గా వున్నట్టు సమాచారం.

సమన్వయపరిచే నాయకత్వంపై దృష్టి

ఉమ్మడి జిల్లాకు సంబంధించి పార్టీ పార్లమెంటు కమిటీల పేరిట మూడు ముక్కలైన సంగతి తెలిసిందే. అందులో రెండు కమిటీలకు సంబంధించి సమర్థ నాయకత్వం లేదని అధినేత భావిస్తున్నట్టు పార్టీ వర్గాల కథనం. కనీసం జిల్లా స్థాయిలో అభివృద్ధి ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళేందుకు, నిధుల కోసం ప్రయత్నించేందుకు కూడా తగిన నాయకత్వం లేకపోవడాన్ని అధినేత గ్రహించినట్టు చెబుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచీ ఎవరికీ మంత్రి పదవి కేటాయించకపోవడం కూడా ఈ పరిస్థితికి కారణం అంటున్నారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దాల్సిన సీనియర్ నేతలు ఎవరి కారణాలతో వారు అసంతృప్తితో మిన్నకుండిపోయినట్టు అధినేత గుర్తించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వారిని చురుగ్గా పనిచేయించే దిశగా అధినేత దృష్టిసారించినట్టు తెలిసింది. అందులో భాగంగా ఇటీవల తిరుమలకు వచ్చిన చంద్రబాబు మాజీ మంత్రి అమరనాధరెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడినట్టు సమాచారం. జిల్లా అభివృద్ధి ప్రతిపాదనలతో పాటు పార్టీ పరంగానూ చర్చించినట్టు తెలిసింది. మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు గానూ అమరనాధరెడ్డిని విజయవాడ వచ్చి తనను కలవాల్సిందిగా అధినేత సూచించినట్టు సమాచారం. దీంతో ఆయనకు ఉమ్మడి జిల్లా పార్టీ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తారా లేక ఆయనతో పాటు మరికొందరు సీనియర్, ముఖ్యనేతలను కూడా పిలిపించి ఉమ్మడిగా బాధ్యతలు అప్పజెబుతారా అన్న ఊహాగానాలు పార్టీ శ్రేణుల్లో వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై మంత్రివర్గంలో చోటు లభించకపోవడంతో పలమనేరు నియోజకవర్గానికే పరిమితమైన అమరనాధరెడ్డి అధినేతను ఇంతవరకూ ఒంటరిగా కలసి మాట్లాడలేదు.ఈ నేపథ్యంలో చంద్రబాబు, అమరనాధరెడ్డి మధ్య జరిగిన సంభాషణ రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. మొత్తం మీద అధినేత దృష్టి సారించడంతో ఉమ్మడి జిల్లాలో పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులకు, కార్యకర్తలకు మేలు జరుగుతుందన్న ఆశాభావం మాత్రం ఆ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి: ఎంపీ, ఎమ్మెల్యే

చిత్తూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాలవారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాలు తగ్గేవరకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఎలాంటి ప్రకృతి విపత్తులు సంభవించినా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ 9491077356, 08572 - 242777కు, చిత్తూరు నగర పాలకసంస్థ కంట్రోల్ రూమ్ 9849907885కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

యాదమరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరిలోని వేణుగోపాలపురానికి చెందిన ఎస్.అబ్దుల్ ఖాదర్ కుమార్తె ఎస్.షతాజ్ (27)ను తమిళనాడు రాష్ట్రం తిరుత్తణికి చెందిన అమీర్ జాన్‌తో 2013లో వివాహం జరిపించారు. భర్త తాగుడుకు బానిసై భార్య, బిడ్డల బాగోగులను పట్టించుకునేవాడు కాదు. కుటుంబ పోషణకై షతాజ్.. అమర్‌రాజా ఫ్యాక్టరీలో పనిచేసేవారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది ఇంట్లోకి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. గమనించిన కుటుంబీకులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.

ద్విచక్రవాహన దొంగ అరెస్టు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంటి ఆపిఉంచిన ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్లే దొంగను రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు... కొన్ని రోజులుగా చిత్తూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు చోరీ అవుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. మంగళవారం ఎస్ఐ ప్రసాద్, సిబ్బందితో కలిసి కాణిపాకం బైపాస్ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. చిత్తూరునుంచి కాణిపాకం వైపునకు మంగసముద్రానికి చెందిన వినోద్‌కుమార్(24) ద్విచక్రవాహనంలో వస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు అతడిని వెంబడించి, పట్టుకుని విచారించారు. వాహనాలను చోరీ చేసి, తమిళనాడులో విక్రయిస్తున్నట్లు తేలింది. దీంతో అతడి వద్ద నుంచి మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వినోద్‌కుమార్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పీజీఆర్ఎస్‌కొచ్చే సమస్యలన్నీ పరిష్కరించాలి

అధికారులకు సూచించిన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు అర్జీల ద్వారా అందే సమస్యలన్నీ పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ విద్యాధరితో కలిసి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమస్యల అందే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎక్కువగా రెవెన్యూ, పోలీసు శాఖలకే అర్జీలు వస్తున్నాయని గుర్తించామని చెప్పారు. జటిలమైన సమస్యలు ఉంటే వాటి పూర్తి సమాచారాన్ని అర్జీదారులకు తెలియజేయాలన్నారు. జడ్పీ సీఈవో రవికుమార్, హౌసింగ్ పీడీ పద్మనాభం, డ్వామా పీడీ రవికుమార్, పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్, డీఎల్డీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



చిత్తూరు సిటీ, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు స్కూల్‌గేమ్స్ సెక్రటరీ వసంతవాణి తెలిపారు. మంగళవారం స్థానిక డీఎస్ఏ స్టేడియంలో అండర్ 14 ఫెన్సింగ్ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహించామన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఈనెల 17 నుంచి 19వ తేదీవరకు నంద్యాలలో నిర్వహించనున్న 68వ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు పంపుతామని పేర్కొన్నారు. పీడీలు రవీంద్రరెడ్డి, శెల్వ పాండ్యన్, కృష్ణ, శిరాజ్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఎస్ఈ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో జిల్లా ఎస్ఈగా ఇస్మాయిల్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఎస్ఈ రూరల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించగా, తిరుపతి ఎస్ఈ సురేంద్ర నాయుడు, క్వాలిటీ కంట్రోల్ జీఎం మురళి, ఈఈలు సురేష్, మునిచంద్ర, శ్రీనివాస మూర్తి, డీఈ, ఏఈలు శుభాకాంక్షలు తెలిపారు.



బంతిపూలతోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శైలజ

వర్షాలకు పంటను కాపాడుకోండిలా..

ప్రస్తుత వర్షాలకు రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే నష్టం వాటిల్లదంటున్నారు చంద్రగిరి మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్, ఉద్యాన అధికారి శైలజ. ఈమేరకు రైతులకు కొన్ని సూచనలు చేశారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

వరి: మొదటి, రెండో దశల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే కాలువ ద్వారా బయటకు పారించాలి. కోత దశలో ఎక్కువ రోజులు పంట నీటిలో ఉంటే విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉంది. దీని నివారణకు ఉప్పు ద్రావణం పిచికారి చేయాలి. వర్షంతో దెబ్బతిన్న పంట త్వరగా కోలుకోవాలంటే అదనంగా నత్రజని సంబంధిత ఎరువులను పిచికారి చేయాలి.

పూలతోటలు: మొక్కలపై 13:0:45 (నీటిలో కరిగే ఎరువు మల్టికే)ను గ్రాము, లేదా 2 గ్రాముల యూరియాను లీటరు నీటికి కలిపి 2, 3 సార్లు వారం రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. కోతకు సిద్ధంగా ఉన్న పువ్వులను వీలైనంత త్వరగా కోసుకోవాలి. ఆకుమచ్చ తెలుగు నివారణకు ప్రోపికొనజోల్ 1 మిల్లీ లేదా, అజాక్సిస్ట్రోబిన్ మిల్లీగ్రాములను లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. తోటల్లో నిలువ ఉన్న అదనపు నీటిని పొలం చుట్టూ కాలువలు తీసి బయటకు పంపాలి. మొక్కలు బలంగా పెరగడానికి పోషకాలు అందించాలి. లేత తోటల్లో చనిపోయిన మొక్కలను తీసి తిరిగి నాటుకోవాలి.

ఉద్యాన పంటలు: వర్షాల వల్ల బంక నేలలో నీరు నిలిచిపోతుంది. నీరు ఎక్కువ నిల్వ లేకుండా వెంటనే బయటకు పంపించే మార్గం చూడాలి. భారీ వర్షాలకు 33 శాతం పైన నష్టం వాటిల్లితే కూరగాయలు, పూలతోటలకు 2.50 ఎకరాకు రూ.17వేలు నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది. మామిడి తోటలకు రెండున్నర ఎకరాలకు రూ.22500 చెల్లిస్తుంది.

కూరగాయల తోటలు: వర్షానికి పడిపోయిన మొక్కలను నిలబెట్టి మొదలు దగ్గర మట్టిని ఎగదోయాలి. మొక్క పెరుగుదల దశలో ఉంటే 13:0:45 (నీటిలో కరిగే మల్టికే) 2 గ్రాములు లేదా 2 గ్రాముల యూరియా ద్రావణాన్ని 2, 3 సార్లు మొక్క తడిసేలా వారం వ్యవధిలో పిచికారి చేయాలి. తెగుళ్ల ఉధృతి నేపథ్యంలో సాఫ్ 2.5 గ్రాములు, లేదా మాంకోజెట్ 2.5 గ్రాములు, జిగురు 0.5 ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. వేరుకుళ్లు ఆశించిన నేలల్లో కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండజిమ్ గ్రాము లీటరుకు కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలి.

వేరుశనగపంటలో జాగ్రత్తలిలా..

తిరుపతి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల నేపథ్యంలో వేరుశనగ రైతులు నష్టనివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ జాన్ వివరించారు. వివిధ దశల్లో ఉన్న వేరుశనగ పంటను కాపాడుకోవడంపై సూచనలు చేశారు. ఆ ప్రకారం.. వేరుశనగ విత్తనం వేసి 2-3 రోజుల సమయంలో ఉన్నప్పుడు నీటమునిగితే మొలకశాతం తగ్గుతుంది. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని బయటకు తీయాలి. ఈ దిశగా బోదెలు ఏర్పాటు చేసుకోవాలి. గింజ గట్టిపడే దశనుంచి చెట్టు పీకే వరకు.. నిద్రావస్థ కలిగిన రకాలలో పంటనష్టం తక్కువగా ఉంటుంది. నిద్రావస్థ లేనటువంటి రకాలు నీటమునిగితే గింజ మొలక వచ్చి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుంది చెట్టు పీకే దశలో ఉన్నట్లయితే చెట్ల మొదళ్లని నిటారుగా నిలబెట్టాలి. దీనివల్ల వర్షపునీరు కాయల మీద నిలబడదు. దీంతో కాయలోని గింజలు మొలకెత్తకుండా నివారించొచ్చు. పూర్తిగా ఆరని పంటని కుప్పలుగా వేసేటప్పుడు పీకిన వేరుశనగచెట్లపై టార్పాలిన్ పట్టలు కప్పుకోవాలి. కల్లాలపై ఉన్న నూర్పిడి చేసిన కాయలు వర్షానికి తడవకుండా చూసుకోవాలి.

25 కిలోల గంజాయి స్వాధీనం: నిందితుల అరెస్టు



నిందితులతో డీఎస్పీ పార్థసారథి, రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్ తదితరులు

కుప్పం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని 89 పెద్దూరు గ్రామంలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి తోటను గుర్తించి నిందితుల నుంచి 25 కిలోల గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ పార్థసారథి, కుప్పం రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్ కథనం మేరకు.. రామకుప్పం మండలంలోని 89 పెద్దూరు వద్ద అదే గ్రామానికి చెందిన లోకేశ్, ఆదికేశవులు గంజాయి సేవిస్తుండగా కుప్పం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు చేయగా అంజప్ప, ధనరాజ్ సాగుచేస్తున్న గంజాయి తోటను గుర్తించారు. వారినుంచి 25 కిలోల గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఆదికేశవులు, లోకేశ్, అంజప్ప, ధనరాజ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐ నరేశ్, శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెలవు రోజు ప్రైవేటు పాఠశాల నిర్వహణ

నోటీసులు జారీ చేసిన ఎంఈవో



పలమనేరులో వర్షంలో పాఠశాల నుంచి మంగళవారం సాయంత్రం ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

పలమనేరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తుండడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఆ మేరకు ఆదేశాలు జారీ చేశారు. అయితే పలమనేరులోని ఒక ప్రైవేటు విద్యాసంస్థ మాత్రం కలెక్టర్ ఆదేశాలు పట్టించుకోకుండా వర్షంలోనే మంగళవారం పాఠశాలను నిర్వహించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కొందరు ఎంఈవోకు, జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై పలమనేరు ఎంఈఓను వివరణ కోరగా సెలవురోజు పాఠశాలను నడిపిన విద్యాసంస్థకు సంజాయిషీ నోటీసులు ఇచ్చామన్నారు. జిల్లా అధికారులకు నివేదిక పంపినట్లు వివరించారు.

తీరుమార్చుకోని ప్రైవేటు విద్యాసంస్థలు

వారం రోజుల క్రితం ఇక్కడి మరో ప్రైవేటు విద్యాసంస్థ సెలవురోజుల్లో పాఠశాల నడుపు తుండగా కొందరు ఆ విద్యాసంస్థ నిర్వాహకులను నిలదీశారు. ఇది స్థానికంగా చర్చనీయాంశమైంది. నెలరోజుల క్రితం మరో విద్యాసంస్థలో ఫీజు చెల్లించలేదని పాఠశాల వెలుపల విద్యార్థులను ఎండలో కూర్చోబెట్టారు. జిల్లా అధికారులు ఈ విద్యాసంస్థల నిర్వహణపై నిఘా వేయాల్సిన అవసరం వుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వీడండి : ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరుఅర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటానని ఎస్పీ మణికంఠ హెచ్చరించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. 16 అర్జీలను జనం అందజేశారు. వీటిల్లో.. భూ తగాదాలపై 6, డబ్బు తగాదాలపై 4, ఆస్తి తగాదాలపై 2, కుటుంబ తగాదా, వేధింపులు, దారి సమస్యలు, ఇంటి తగాదాల కింద ఒక్కో అర్జీ వంతున ఉన్నాయి. చట్ట ప్రకారం విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు.

యూడీఐడీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

చిత్తూరుఅర్బన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) జిల్లాలోని దివ్యాంగులకు ప్రభుత్వ పథకాల కు యూనివర్శల్ డిసేబుల్డ్ ఐడెంటిటీ కార్డు(యూడీఐడీ)కు అర్హులైన వారంతా ఆన్‌లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. swavlambancard.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు చేసుకునేవారు సదరం మెడికల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సంతకం అప్‌లోడ్ చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న పది రోజుల తర్వాత యూడీఐడీ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

చిత్తూరు డీఎల్పీవో బాధ్యతల స్వీకరణ



పార్వతి

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్పీవో)గా బి.పార్వతి మంగళవారం డీపీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలో పనిచేస్తుండగా ప్రభుత్వం ఇటీవల చిత్తూరుకు బదిలీ చేసింది. అలాగే కొత్త డీపీవో బాధ్యతలు స్వీకరించేంతవరకు ఇన్‌చార్జి డీపీవోగానూ కొనసాగుతారు. ఇప్పటివరకు చిత్తూరు డీఎల్పీవోగా పనిచేస్తున్న లక్ష్మిని ప్రభుత్వం కర్నూలు డీఎల్పీవోగా బదిలీ చేయగా, మంగళవారం ఆమె రిలీవ్ అయ్యారు.

పట్టుబడ్డ నిత్యావసరాల వేలం 23న: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్మగ్లింగ్‌లో పట్టుపడ్డ నిత్యావసర వస్తువులను ఈనెల 23న వేలం వేయనున్నట్లు జేసీ విద్యాధరి తెలిపారు. స్మగ్లింగ్‌లో పట్టుబడ్డ బియ్యాన్ని భద్రతా నిమిత్తం ఎం.ఎల్ పాయింట్లలో ఉంచామన్నారు. కుప్పంలో 13.032 టన్నులు, శాంతిపురంలో 5.250 టన్నులు, బంగారుపాళ్యంలో 17.200 టన్నులు, పలమనేరులో 5.760 టన్నులు, సదుంలో 1.640 టన్నులు, వి.కోటలో 3.120 టన్నులు, చిత్తూరులో 34.747 టన్నులు, నగరిలో 16.815 టన్నులు నిల్వ ఉంచినట్లు వివరించారు. ఈనెల 23న ఉదయం 11 గంటలకు ఆయా మండలస్థాయి గోదాముల వద్ద బహిరంగ వేలం జరుగుతుందని పేర్కొన్నారు. వేలంపాటదారులు కలెక్టర్ (సీఎస్) చిత్తూరు జిల్లా పేరిట ధరావత్తుగా రూ.లక్ష ఎస్బీఐ గిరింపేట బ్రాంచ్, చిత్తూరులో చెల్లుబాటు అయ్యేవిధంగా డీడీ తీయాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖ వారికి జీఎస్టీ లైసెన్సు కలిగి ట్రేడర్, రైస్‌మిల్లర్‌గా ఉండాలన్నారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

■ లేడీస్ స్పెషల్

డ్రైవింగ్ ఎక్స్‌పర్ట్

● మహిళలకు డ్రైవింగ్‌లో ప్రత్యేక శిక్షణ



మహిళలు కొత్త రంగాల్లోనూ దూసుకెళుతున్నారు. ఇన్నాళ్లూ పురుషులకే పరిమితమైన అంశాల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. వారిలో ఒకరే చిత్తూరుకు చెందిన సునీత

చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లెకు చెందిన సునీత తన భర్త జి.సురేంద్ర 2003లో స్థాపించిన శ్రీదుర్గా మోటార్ డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్ నేర్చుకున్నారు. అప్పటినుంచి మహిళలకు డ్రైవింగ్ నేర్పించడం వృత్తిగా మార్చుకుని 20 ఏళ్లుగా ఇదే పనిలో ఉన్నారు. ఐటీఐ, డిగ్రీ చదివిన ఈమెకు హెవీ వెహికల్స్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా వుంది. భారీ వాహనాలను సైతం అవలీలగా నడిపేస్తారు. చిత్తూరులో డ్రైవింగ్ నేర్పే మహిళ ఈమె ఒక్కరే కావడంతో చాలామంది విద్యార్థినులు, ఉద్యోగినులు ఈమె వద్దకే వస్తుంటారు. ద్విచక్రవాహనాలు, కార్లు వంటివి 45 రోజుల్లో నడపడం నేర్పిస్తారు. రోడ్డు భద్రతపై, వాహనాల్లో ఏర్పడే చిన్న చిన్న సమస్యలను పరిష్కరించడంపైనా అవగాహన కల్పిస్తారు.

\- చిత్తూరు సిటీ, ఆంధ్రజ్యోతి

అబ్కారీ శాఖకు పునరుత్తేజం

పాతమద్యం డిపోలకు తరలింపు ● అమల్లోకి కొత్త మద్యం పాలసీ

చిత్తూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో అమ్మిన నాసిరకం మద్యానికి ఎన్నో కుటుంబాలు బలయ్యాయి. ప్రభుత్వమే దుకాణాల్లో రోజుకో కొత్త బ్రాండు తెచ్చి పెట్టడంతో తాగి ఆరోగ్యం పాడు చేసుకునేవారు కొందరు.. మద్యం ధరలు అధికంగా ఉండడంతో సారా, గంజాయికి అలవాటు పడి ప్రాణాల మీదకి తెచ్చుకున్నవారు మరికొందరు ఉన్నారు. గాడి తప్పిన ఈ మద్యం విధానాన్ని చక్కదిద్దే పనిలో భాగంగా నాసిరకం 'జే' బ్రాండ్లపై కూటమి సర్కారు వేటు వేసింది. నేటి నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేయనుంది. నేడు ప్రారంభం కానున్న ప్రైవేటు మద్యం దుకాణాల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు అనుగుణంగా నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకురానుంది. చతికిలపడిన అబ్కారీ శాఖకు పునరుత్తేజం కలిగించి మద్యం అమ్మకాలపై నిఘా వ్యవస్థను పటిష్ఠం చేస్తోంది.

● నేటినుంచి ప్రైవేటు దుకాణాలు

ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో నేటి నుంచీ జిల్లాలో 104 ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కానున్నాయి.ఎక్సైజ్ అధికారులు మంగళవారం ఆయా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మిగిలిపోయిన స్టాకును డిపోలకు తరలించేశారు. కొత్త దుకాణాల కోసం ప్రభుత్వం పంపించిన మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఐదేళ్ల పాటు మద్యం దుకాణాల్లో ఆన్‌లైన్ పేమెంట్ లేని విషయం తెలిసిందే. నేడు ప్రారంభమయ్యే దుకాణాల్లో ఆన్‌లైన్ పేమెంట్ విధానాన్ని అందుబాటులో ఉంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

● ఎక్సైజ్ శాఖలో నూతనోత్సాహం

ఇన్నాళ్లు అయిష్టంగా సెబ్‌లో పనిచేసిన ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ఎట్టకేలకు సొంతగూటికి చేరుకోవడంతో వారిలో నూతనోత్సాహం కనిపిస్తోంది. సెబ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినప్పుడు కొందరు సిబ్బంది సీఎం చిత్రపటానికి పాలాభిషేకం కూడా చేశారు. జిల్లాలో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, పలమనేరు, కుప్పం, కార్వేటి నగరం, నగరి, పులిచెర్ల, పుంగనూరు ప్రాంతాల్లో మొత్తం 8 సెబ్ స్టేషన్లను.. కూటమి ప్రభుత్వం ఎక్సైజ్ స్టేషన్లుగా మార్చింది. జిల్లాలో 13మంది ఇన్‌స్పెక్టర్లు, 14 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు మిగిలిన 113 మందిలో హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పనిచేస్తున్నారు.

● తగ్గనున్న మద్యం ధరలు

దశల వారీగా మద్య నిషేధం అమలు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం.. మద్యం ధరల్ని రెండు మూడు రెట్లు పెంచి మందు బాబులపై భారం మోపింది. కూటమి ప్రభుత్వం నూతన మద్యం విధానంతో మందు భారం తగ్గించబోతోంది. గతంలో రూ.200 నుంచి రూ.250 పెట్టి కొనుగోలు చేసే క్వార్టర్ బాటిల్‌ను ఇప్పుడు రూ.99 నుంచి రూ.130కే అందుబాటులోకి తీసుకురానుంది.నాసిరకం మద్యం స్థానంలో ప్రముఖ కంపెనీ బ్రాండ్లను అందుబాటులోకి తీసుకురానుండడంపై మందుబాబుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

● ఐదేళ్లలో విచ్చలవిడిగా కర్ణాటక మద్యం

నాణ్యమైన మద్యం అందుబాటులో లేకపోవడం, ధరలు అధికంగా ఉండడంతో ఐదేళ్ల పాటు జిల్లాలో కర్ణాటక మద్యం విచ్చలవిడిగా ప్రవహించింది. కర్ణాటక రాష్ట్రం పొరుగునే ఉండడంతో కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలకు చెందిన కొందరు వైసీపీ నాయకులు ఈ వ్యాపారంతో రూ.లక్షలు వెనకేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యాన్ని దొంగతనంగా తెచ్చుకుని, ఇక్కడ గ్రామాల్లో అమ్ముకుని సొమ్ము చేసుకునేవారు. కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దున ఉన్న వి.కోట వంటి మండలాల చుట్టూ కర్ణాటక మద్యం దుకాణాల్ని అధికారికంగా నిర్వహించేవారు.

రేపటి నుంచి ద్రావిడ వర్సిటీలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

గుడుపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలో 2024- 25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల ప్రవేశానికి ఏపీ పీజీ సెట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ నెల 17 నుంచి 21 వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులు దరఖాస్తులను ఈ నెల 22 నుంచి 24లోపు ఆన్‌లైన్‌లో రూ.500 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

వణికిస్తున్న గజరాజుల సంచారం

సదుం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో కొంతకాలంగా నిత్యం ఏనుగుల సంచారం, పంట పొలాల విధ్వంసం జరుగుతున్న విషయం పాఠకులకు తెలిసిందే. తాజాగా పీలేరు-సదుం సరిహద్దు ప్రాంతాల్లోని ఇందిరమ్మ కాలనీ చిన్నగాండ్లపల్లె సమీపంలో సుమారు 15 ఏనుగుల గుంపు పంట పొలాలను ధ్వంసం చేయడంతోపాటు రాజారెడ్డి అనే రైతును చంపేశాయి. సదుం, సోమల, పీలేరు ప్రాంతాల్లోనే ఏనుగుల గుంపు తిష్ట వేసి ఉండడం ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గుండెపోటుతో కండక్టర్ మృతి

చెన్నై, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఓ కండక్టర్ గుండెపోటుతో మృతి చెందాడు.నగరి ప్రాంతానికి చెందిన కుప్పయ్య (53) తిరుత్తణి బస్ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం 10.30 గంటలకు తిరుత్తణి-కోనసముద్రం బస్సులో వెళ్తుండగా, నత్తం బస్టాండ్ సమీపంలో కుప్పయ్య హఠాత్తుగా స్పృహ తప్పి పడిపోయాడు. డ్రైవర్ అతడిని వెంటనే తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.తిరుత్తణి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గిరిజనులందరికీ ఆధార్ కార్డులివ్వండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులకు నోచుకోని గిరిజనులందరికీ తహసీల్దార్లు, ఎంపీడీవోలు సమన్వయం చేసుకుని ఆధార్ కార్డులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనులు పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ కార్డు అవసరమన్నారు. ఆధార్ కార్డు మంజూరుకు తొలుత జనన ధ్రువీకరణ పత్రం అవసరమన్నారు. ఇవిలేని గిరిజనులకు ఎంపీడీవోలు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని చెప్పారు. ఇందుకోసం సంచార ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు తమ సచివాలయ పరిధిలో ఆధార్ కార్డులు లేని గిరిజనుల జాబితా సిద్ధం చేయాలని సూచించారు. జేసీ విద్యాధరి, గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎస్.మూర్తి, జడ్పీ సీఈవో రవికుమార్, డీఎల్డీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా భార్య, కొడుకును కిడ్నాప్ చేశాడు

రైల్వే కానిస్టేబుల్‌పై పాపిరెడ్డిపల్లెవాసి ఆరోపణ



కుమారుడితో రోజా

చిత్తూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తన భార్య కుమారుడిని రైల్వే కానిస్టేబుల్ కిడ్నాప్ చేశాడని పెనుమూరు మండలం పాపిరెడ్డిపల్లెకు చెందిన పట్టాభి ఆరోపించాడు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు వివరాలు తెలిపాడు. చిత్తూరు మండలం మురకంబట్టు పెద్ద కొత్తూరుకు చెందిన రోజాతో 2012లో పెద్దల సమక్షంలో పట్టాభి పెళ్లి జరిగింది. వీరికి 12 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. జీవనోపాధి కోసం భార్యతో కలసి బెంగళూరుకు వెళ్లి కూలిపనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో రోజాకు ఆమె స్వగ్రామానికి చెందిన, చిత్తూరు రైల్వేస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే జ్ఞానశేఖర్ తరచూ ఫోన్ చేసేవాడు. దీన్ని గమనించి భర్త, తల్లిదండ్రులు, బంధువులు ఆమెను మందలించారు. గత నెల 25వ తేదీన కుమారుడితో కలిసి బెంగళూరు నుంచి చిత్తూరుకు రోజా వచ్చింది. ఆరోజు నుంచి వారిద్దరూ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో జ్ఞానశేఖర్‌ను పట్టాభి అడిగాడు. 'నేనే వారిని కిడ్నాప్ చేశాను, నీకు దమ్ము, ధైర్యం ఉంటే నాపై కేసుపెట్టుకో' అంటూ జిల్లా కోర్టు ఎదుటే తనను కానిస్టేబుల్ బెదిరించాడని పట్టాభి తెలిపాడు. ఈ విషయంపై 15 రోజుల కిందట స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నాడు. తనకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబుకు, హోం మంత్రి అనితకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లిఖిత పూర్వకంగా అర్జీ రాసి రిజిస్టర్ పోస్టు చేశానని చెప్పాడు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తన బిడ్డ, భార్య ఆచూకీ తెలియజేయాలని కోరాడు.

రూ.45వేల కర్ణాటక మద్యం స్వాధీనం : ఒకరి అరెస్టు



నిందితుడు, మద్యాన్ని మీడియాకు చూపిస్తున్న సీఐ శ్రీనివాసరావు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తీసుకొస్తున్న ఓ వ్యక్తిని పట్టుకున్నారు. అతడి వద్దనుంచి రూ.45వేల మద్యాన్ని, కారును సీజ్ చేశారు. రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. ముందస్తు సమాచారంతో మంగళవారం చిత్తూరు రూరల్ మండలం నరిగపల్లె నుంచి కన్నికాపురంవైపు అనుమానాస్పదంగా వస్తున్న కారును ఆపి తనిఖీ చేశారు. అందులో 720 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని గుర్తించారు. కారుతోపాటు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కారులోని కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్ జిల్లా గౌరిబిడయార్‌కు చెందిన శివకుమార్(34)ను అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రమేష్‌బాబు కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, Galla Sowjanya (Old Name) W/o Maddipatla Venkataramana Naidu R/o A' Block, Flat No:105, Amogya Willow Tree Apartment, Uppara Palli, Thummalagunta, Tirupati Rural, Tirupati Dist., A.P. Have Changed My Name To "Maddipatla Sowjanya (New Name)"
AJT - 4390

CHANGE OF NAME
I, Devarapalli Rajamohan Reddy (Old Name), R/o: 2-2070, Chennareddy Street, Piler, Annamayya Dt, A.P. Do Here By Declared I Have Changed My Surname As DEVALAPALLI RAJA MOHAN REDDY (New Name) S/o Devalapalli Pulla Reddy
AJT - 4392

TO-LET
తిరుపతి లీలా మహల్ సర్కిల్‌లో విఘ్నేష్ టవర్స్ 501, 502 (2300) స్క్వేర్ ఫీట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ఫుల్ ఫర్నిచర్ క్యాబిన్ అద్దెకు ఇవ్వబడును 98667 26232
AJT -196861

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రః 7382114647
AJA- 198095

CHANGE OF NAME
I, Shaik Ameerun Begum (Old Name), R/o: 1/171, Apparajupeta, Pullampeta, Annamayya Dt, A.P., Do Here By Declared I Have Changed My Name As SHAIK AMEERUN (New Name) W/o Shaik Imamsha Vali.
AJT - 4394

CHANGE OF NAME
I, Shaik Shahera Bhanu (Old Name), R/o: 4-703, Podhili Road, Darsi, Prakasam Dt, A.P. Do Here By Declared I Have Changed My Name As Shahera Shaikh(New Name) W/o Shabbir Shaikh
AJT - 4393

TOLET
Tirupati, L.S.Nagar, Near Vidyanagar Colony, 1st & 2nd Floors 3 BHK. Rent 25,000 top Floor Single room and car parking facilities Cont. : 98852 14247
AJT - 200560

WANTED
APSRTC మంగళం మరియు తిరుమల డిపో నందు బస్సులను కడుగుట మరియు తిరుమల డిపో నందు Assist Machine గా పనిచేయుటకు Diesel, and Motor Machines కావలెను. సంప్ర. : 77939 95619, 99893 76568
AJT - 4347

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

నిషేధిత జాబితా నుంచి 911 ఎకరాల

రైతుల భూములను తొలగించండి

- ఆవులపల్లె ప్రాజెక్టు ముంపు భూములకు వన్‌బీ ఇప్పించండి
- సీతమ్మచెరువు కట్ట నిర్మించేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయండి
- రైతుల డిమాండ్లపై అధికారుల హామీలతో పీఎల్ఆర్ కంపెనీ మెటీరియల్ తరలింపు



డీఈఈ ప్రసాద్‌తో మాట్లాడుతున్న రైతులు



ఆవులపల్లె నుంచి లారీల్లో తరలిస్తున్న ఇనుప కమ్మీ

పుంగనూరు/సోమల, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):పూర్వీకుల నుంచి తమ అనుభవంలో ఉన్న 911 ఎకరాల వ్యవసాయ భూములను వైసీపీ ప్రభుత్వంలో అన్యాయంగా తహసీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారని, వాటిని ఆ జాబితా నుంచి తొలగించి వన్‌బీ మంజూరు చేయాలని రైతులు కోరారు. మంగళవారం సోమల మండలం ఆవులపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో దేవలకుప్పం, పత్రపల్లె, ఆవులపల్లె,దేవలకుప్పం, ఉప్పరపల్లె, బయారెడ్డిపల్లె, రామకృష్ణాపురం తదితర గ్రామాల ప్రజలు, మహిళలు పీఎల్ఆర్ కంపెనీ మెటీరియల్‌ను తరలించకుండా అడ్డుకునేందుకు సిద్ధపడ్డారు. ఆవులపల్లె ప్రాజెక్టు కోసం గతంలో తెంచేసిన సీతమ్మ చెరువు కట్టను తిరిగి నిర్మించాలని పట్టుబట్టారు. రైతులు ఏకం అవుతుండగా పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, సోమల ఎస్ఐ శివశంకర్, తహసీల్దార్ బెన్నిరాజ్, చిత్తూరు ఇరిగేషన్ డీఈఈ ప్రసాద్, జేఈ ఝూన్సీ, ఆర్ఐ సుబుక్తుల్లా తదితరులు ఆవులపల్లెకు చేరుకుని రైతులతో చర్చించారు. కాంట్రాక్టర్ హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకోవడంతో మెటీరియల్‌ను కర్నాటక రాష్ట్రానికి తరలించుకునేందుకు అడ్డుపడకుండా సహకరించాలని కోరారు. పీఎల్ఆర్ కంపెనీ గతంలో తహసీల్దార్ శ్యాంప్రసాద్‌రెడ్డి, పోలీసు అధికారుల ద్వారా రైతులపై తప్పుడు కేసులు పెట్టడం, బెదిరించడమే కాక చెరువు గుండా వెళ్లేందుకు కూడా అనుమతి ఇవ్వకుండా నరకం చూపారని రైతులు లక్ష్మీపతి నాయుడు, వేణుగోపాల రెడ్డి తదితరులు వాపోయారు. సీతమ్మచెరువు కట్టను కోర్టు ఆర్డర్ ఉన్నా తెంచేశారని, అడ్డు పడ్డామని జమీందారుల నుంచి కొనుగోలు చేసిన, పూర్వీకుల నుంచి మా ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూములను, 70 ఏళ్ల క్రితం మామిడి చెట్లు, ఆస్తులను రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ఆస్తులుగా అన్యాయంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది డిసెంబరులో అధికారులు మా భూములను ఫారెస్టు భూములుగా మార్చి ట్రెంచ్‌లు కొట్టి దౌర్జన్యంగా బోర్డులు పెట్టారన్నారు.తర్వాత 22ఏ జాబితాలోకి మార్చి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డులు మార్చారని, వన్ బీ రాకుండా, ఎలాంటి లావాదేవీలు జరగకుండా, వ్యవసాయానికి బ్యాంకు రుణాలు రాకుండా రైతులపై పగ తీర్చుకున్నారని ఆరోపించారు. సదుం మండలం బూరగమందకు చెందిన వ్యక్తి ద్వారా రైతులపై లోకాయుక్తకు తప్పుడు ఫిర్యాదు ఇప్పించి నెల రోజుల్లో మాకు వ్యతిరేకంగా ఆర్డర్ తెచ్చారని దుయ్యబట్టారు. సోమల తహసీల్దార్ బెన్నిరాజ్‌తో వారు మాట్లాడుతూ వెంటనే తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి వన్‌బీ మంజూరు చేయాలని కోరారు.గతంలో జరిగిన విషయాలతో తనకు సంబంధంలేదన్న తహసీల్దార్ బెన్నిరాజ్ ఇప్పుడైతే రెవెన్యూపరంగా ఉన్న సమస్యలను పరిశీలిస్తామని, రైతులకు మద్దతుగా ఉంటామని చెప్పారు. ఇరిగేషన్ డీఈఈ ప్రసాద్ మాట్లాడుతూ సీతమ్మ చెరువు కట్ట నిర్మాణానికి ఉన్నతాధికారుల ఆదేశాలతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని చెప్పడంతో రైతులు శాంతించారు. అనంతరం పోలీసు బందోబస్తు నడుమ పీఎల్ఆర్ కంపెనీకి చెందిన కమ్మీని రెండు లారీల్లో తరలించారు.

రైతులకు అండగా ఉంటాం

చల్లా రామచంద్రారెడ్డి

సోమల మండలం ఆవులపల్లె ప్రాజెక్టు ముంపు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన ఫోన్‌లో రైతులతో మాట్లాడుతూ ఇదివరకే జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సీతమ్మ చెరువు వద్దకే తీసుకొచ్చి సమస్యను వివరించామని గుర్తు చేశారు. త్వరలోనే సీఎం చంద్రబాబును, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడిని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

20న ద్రావిడ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

గుడుపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఈ నెల 20 న 27వ వ్యవస్థాపక దినోత్సవం కందుకూరి వీరేశలింగం పంతులు ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే పల్లె ప్రగతి : కంచర్ల


సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

గుడుపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంతోనే పల్లె ప్రగతి పరుగులు పెడుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పెద్దబజనవాడ పంచాయతీ కమ్మ గుట్టపల్లె గ్రామంలో 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు టీఎం బాబునాయుడు, తహసీల్దార్ సీతారాం, ఎంపీడీవో మన్సూర్, జనసేన ఇన్‌చార్జి నరేష్, భానుమూర్తి, హనుమంతు, రామచంద్ర, శ్రీనివాసులు, బాలు, రవి, కన్నయ్య, సామిడప్ప, చలపతి పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ అధ్యాపకుల నిరసన


పసుపు రిబ్బన్లతో నిరసన చేపట్టిన అధ్యాపకులు

సోమల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తమను రెగ్యులరైజ్ చేయాలని సోమల జూనియర్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులు పసుపు రిబ్బన్లు ధరించి నిరసన తెలియజేశారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో వారు మాట్లాడుతూ గతంలో ఎన్నికల కోడ్ వల్ల తమ రెగ్యులరైజేషన్ ఆగిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి జీవో నెంబరు 114 అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివయ్య, గౌతం, నాగరత్న, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినికి ఆర్థికసాయం


విద్యార్థినికి ఆర్థికసాయం అందజేస్తున్న హెచ్‌ఎం హరినాథ్

సోమల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమల ఉన్నత పాఠశాలలో 2023 -24 సంవత్సరం పదో తరగతి చదివి 565 మార్కులు సాధించిన అడుసుపల్లెకి చెందిన విద్యార్థిని మందా నాగేశ్వరి ఇడుపుల పాయ ట్రిపుల్ ఐటీలో సీటు సాధిం చింది. దీంతో నడింపల్లెకు చెందిన బాలన్నగారి శివసాగర్ ఆమెకు ప్రోత్సా హకంగా రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. మంగళవారం ఆ విద్యార్థిని హెచ్‌ఎం హరినాథ్, పీడీ కరుణానిధి అభినం దించించారు. ప్రతి ఏటా ఉత్తమ ప్రతిభ కరబరిచి విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తానని దాత శివసాగర్ తెలిపారు. పలువురికి నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

పలమనేరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పలమనేరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీ కార్యాలయంలో తుఫాను కారణంగా కురిసే భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సహాయం కోసం కంట్రోలు రూమ్ ఏర్పాటుచేశామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. కంట్రోల్‌రూమ్ అధికారిగా మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కంట్రోలు రూమ్ ఫోన్ నంబర్లు 08579-252217, 798148,1929 అని వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ఆలయ భూముల వేలం

పలమనేరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ భూముల కౌలుకు మంగళవారం ఆలయ ఆవరణలో దేవదాయశాఖ అధికారులు వేలం పాటలు నిర్వహించారు. గంగవరం సమీపంలోని ఆలయ భూమి కౌలుకు 25 వేలు ధరపలికింది. మరో మూడుచోట్ల ఉన్న ఆలయ భూముల కోసం ఎవరూ ముందుకు రాలేదు. ఈ వేలంలో ఆలయ ఈవో కమలాకరరావు, మదనపల్లి ఎండోమెంట్ అధికారి చలపతి, స్థానిక ఎండోమెంట్ సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీల్లో విధులపై వార్డు సభ్యులకు శిక్షణ

బైరెడ్డిపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీల్లో విధులు, అధికారాలు, బాధ్యతల గురించి ఉప సర్పంచులు, వార్డుసభ్యులకు రెండురోజుల శిక్షణ తరగతులను ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ ప్రారంభించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఇందులో ప్రజాప్రతినిధుల పాత్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు రాజశేఖరాచారి, సురేష్, గణేష్, ఎంపీవో సురేష్‌బాబు పాల్గొన్నారు.

రేపు పలమనేరు డిగ్రీకళాశాలలో జాబ్‌మేళా

పలమనేరు, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో ఈ నెల 17 వతేదీ గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు తెలిపారు. రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ సంస్థలు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చౌడేపల్లె సంత.. బురదతో చింత


వర్షానికి రొచ్చు రొచ్చుగా మారిన సంతలోనే సాగుతున్న కొనుగోళ్లు

చౌడేపల్లె, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు చౌడేపల్లె వారపు సంత రొచ్చు రొచ్చుగా మారింది. మంగళవారం జరుగుతున్న వారపు సంతకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలు వచ్చారు. సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు వారపు సంత రొచ్చు రొచ్చుగా బురద మయంగా మారింది. బురదలో నడుస్తూనే కాయగూరలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. వ్యాపారులు టార్పలిన్ పట్టలను ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగించాల్సి వచ్చింది.

కలాం సేవలు మరువలేనివి


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న అయూబ్‌ఖాన్


కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేఈసీ బోధన, బోధనేతర సిబ్బంది

పుంగనూరు, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): సైంటిస్టుగా, రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేనివని కలాం హెల్త్, ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పి.అయూబ్‌ఖాన్ కీర్తించారు. మంగళవారం పుంగనూరులో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్ బాబు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదనాచారి, బీజేపీ ఎస్సీ సెల్ అధ్య క్షుడు నరసింహులు, ఎస్‌కేఆర్ మురళి, టీపీఎస్ నాగరాజు, పెద్ద మఠం బాబు, అమరనారాయణ, భద్రయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కుప్పం: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు అన్నారు. కేఈసీలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఆర్ అండ్ డి, ఈసీఈ విభాగాధిపతి జీఎస్.కోదం డ రామయ్య, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్లు జే.మాధవన్, ఎం.గంగాధరన్, విభాగాధిపతులు, అధ్యాపకులు, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సోమల: స్థానిక జూనియర్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధరంనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు బేలుపల్లెలో కబడ్డీ పోటీలు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి సందర్భంగా బేలుపల్లె గ్రామంలో వాల్మీకి యువజన సంఘం ఆధ్వర్యంలో 17వ తేదీ గురువారం రాత్రి 9 గంటల నుంచి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు రూ.600 ప్రవేశ రుసుం చెల్లించి పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. కాగా వర్షం ఉంటే వాయిదా వేసే అవకాశం ఉందని వివరించారు.

వర్షపు నీరు నిల్వలేకుండా చూసుకోండి

వి.కోట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాను నేపథ్యంలో రైతులు వరి, రాగి పైరుల్లో వర్షపు నీరు నిల్వలేకుండా చూసుకోవాలని ఏవో రాజ్యలక్ష్మి తెలిపారు.

ఎడతెరపి లేని జడివాన

సదుం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరపి లేని జడివానతో రోజువారీ జనజీవనం స్తంభించిపోయింది. సోమవారం 12 గంటల నుంచి నిరంతరాయంగా జడివాన కురుస్తూనే ఉంది. ఈ వాన పూల సాగుకు అనుకూలం. అయితే టమోటా పంట దెబ్బ తినడంతో పాటు నాణ్యత లోపిస్తుందని టమోటా రైతుల్లో ఆందోళన నెలకొంది. కాస్తో కూస్తో దిగుబడి అయిన వేరుశెనగ కూడా దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు. తోపుడు బండ్ల వ్యాపారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

చింతపండు ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటు చేయండి


చల్లా బాబుకు వినతిపత్రం అందజేస్తున్న వ్యాపారస్తులు

పుంగనూరురూరల్/ రొంపిచెర్ల, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): చింతపండు వ్యాపారస్తుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు, టీడీపీ నాయకులు కోరారు. మంగళవారం వారు టీడీపీ పుంగనూరు నియోజక వర్గం ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి ఆయన ఇంటి వద్ద కలిశారు. చింతపండుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల పన్నులు విధించి ఇబ్బం దులు గురిచేస్తున్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పన్నుల విధింపులో రాయితీలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పుంగనూరులో చింతపండు ప్రాసెసింగ్ పరిశ్రమ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. సమస్యలను సీఎం చంద్రబాబు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, వాణిజ్యశాఖ మంత్రి భరత్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చల్లా బాబు హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుహేల్‌బాషా, సద్దాంహుస్సేన్, వ్యాపారస్తులు చాంద్‌బాషా, అప్సర్‌బాషా, హఫీజ్, బాబా, అఫ్జల్, షరీఫ్, ఫయాజ్, నూర్‌బాషా, రఫిక్, జాకీర్, మున్నా, మస్తాన్, నయాజ్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

రొంపిచెర్ల, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): : గ్రామాల్లో అభివృద్ధి పనులకు సహకరించాలని ఎంపీడీవో మధుసూధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 11 పంచాయతీలకు సంబంధించిన ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. గ్రామ పరిపాలన, అభివృద్ధి, పారిశుధ్యం, ఆరోగ్యం, ఆదాయం పెంచడం, ఆస్తుల సంరక్షణ తదితర అంశాలపై వివరించారు.

రోడ్డు పనులకు భూమిపూజ

వి.కోట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంగాటం పంచాయతీ కనమనాయన పల్లెలో సీసీ రోడ్డు పనులకు టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు రంగనాథ్, కార్యదర్శి ఈశ్వర్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఈశ్వరన్, ఏపీవో అశోక్‌రెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన జనజీవనం

వి.కోట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా ముసురువానతో జనం ఇబ్బంది పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రోజంతా వర్షం కురుస్తూనే ఉండటంతో జన జీవనం స్తంభించింది. గాలుల ధాటికి అక్కడక్కడా అరటి తోటలకు నష్టం వాటిల్లింది.

పుంగనూరులో ఫ్లెక్సీల తొలగింపు

పుంగనూరు రూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు పుంగనూరులో ఎన్డీయే కూటమి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, బ్యానర్లను తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూధన్‌రెడ్డి తెలిపారు.

గ్రామీణ అభివృద్ధిపై అవగాహన ఉండాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై పాలకులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని పుంగనూరు ఎంపీడీవో లీలామాధవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ వార్డు సభ్యులకు పాలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పంచాయతీలకు అందించే నిధులు సక్రమంగా ఖర్చు జరిగేలా చూడాల్సిన బాధ్యత వార్డు సభ్యులపై ఉందని వివరిం చారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలనా విధానంపై పట్టు అవసరం


మాట్లాడుతున్న ఈవోపీఆర్‌ఆర్‌డీ వరప్రసాద్

సదుం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థ పాలనా విధానంపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పట్టు కలిగి ఉండాలని ఈవోపీఆర్ ఆర్‌డీ వరప్రసాద్ సూచించారు. పంచాయతీ పాలనా విధానంపై మండలంలోని 18 పంచాయతీల నుంచి ఇద్దరేసి వార్డు సభ్యులు, ఉపసర్పంచులకు నిధుల వినియోగం, పన్ను వసూళ్లు, అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారాలపై చర్యలు, తదితర అంశాలపై మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇందులో ఆయన మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



సదుం, అక్టో బరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుపల్లె పంచాయతీ పుట్టావారిపల్లెలో నిర్మించిన విరూపాక్ష మ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతి ష్ఠాపన భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వ హించారు. అలాగే నడిగడ్డ పంచాయతీ దళితవాడలోనూ మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పనిచేయలేదని మందలించిన మహిళపై దాడి

రొంపిచెర్ల, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): పనికి పోకుండా ఖాళీగా ఉండడంపై మందలించిన మహిళపై ఓ యువకుడు గాజు పెంకుతో దాడిచేశాడు. రొంపిచెర్ల పంచాయతీ వారణాసివారిపల్లెకు చెంది ప్రవీణ్, రోజా(35) బంధువులు. ఈ క్రమంలో ప్రవీణ్ మూడు రోజులుగా పనికిపోకుండా ఖాళీగా ఉండడంపై రోజా అతడిని మందలించింది. దీంతో అతడు ఆమెపై గాజు పెంకుతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. కుటుంబసభ్యులు ఆమెను రొంపిచెర్లలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

ఉపాధి నిధులతో గ్రామాభివృద్ధి సాధ్యం


బురుజుపల్లెలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

సోమల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం నిధులు సద్వి నియోగం చేసుకోవాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లా హరిప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బురుజుపల్లెలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. వల్లిగట్ల, ఎర్రంవారిపల్లెలో పలు సీసీ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దినకర్‌బాబు, జేఈలు ఆనంద్, రెడ్డెప్ప, టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, రెడ్డి మోహన్, ఈశ్వర్ యాదవ్, రమణయ్య, బాలకృష్ణమ నాయుడు, గుర్రప్పనాయుడు, పురుషోత్తంనాయుడు, కార్యదర్శి వెంకటరమణ, వీఆర్వో సుబ్రమణ్యం, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): పుంగనూరు- తిరుపతి మార్గంలో ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో మంగళవారం ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చౌడేపల్లె మండలం 29ఏ- చింతమాకులపల్లె పంచాయతీ ఖాన్‌సాబ్‌మిట్టకు చెందిన కరీం కుమారుడు అస్రఫ్‌అలీ (35) ద్విచక్రవాహనంలో సోమలలోని బంధువుల ఇంటికి వెళుతుండగా సింగిరిగుంట సమీపంలో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలో అతి వేగంగా వస్తూ ఢీకొనడంతో అస్రఫ్‌అలీ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సాయంతో కుటుంబసభ్యులు అతడిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి..

పుంగనూరు మండలం పాళ్యంపల్లె పంచాయతీ షికారిపాళ్యంకు చెందిన సరోజ్ కుమారుడు ముత్యాలప్ప(33) సొంత పనులపై పుంగనూరుకు ద్విచక్ర వాహనంలో వచ్చాడు. పనులు పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. పుంగనూరు- మదనపల్లె మార్గంలోని భీమగానిపల్లె క్రాస్ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి శ్రీకృష్ణదేవరాయులు విగ్రహం గోడను ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. 108 సిబ్బంది అతడిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.





ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ కట్టడాలకు పన్ను విధించకండి

● కమిషనర్‌కు పాలకవర్గ సభ్యుల వినతి



నగరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ప్రభుత్వానికి సంబంధించిన కాలువ, రోడ్డు, చెరువు పోరంబోకు స్థలాల్లోని అక్రమ కట్టడాలకు పన్ను విధించొద్దని కమిషనర్ కృష్ణారెడ్డికి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు వినతిపత్రం అందించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లినవారు మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాల్లోని కట్టడాలకు పన్ను విధిస్తే కట్టడాలు సక్రమమైనవిగా భావిస్తారన్నారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కౌన్సిలర్లు గోపల్‌రెడ్డి, ఇంద్రయ్య, మునికృష్ణారెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఎల్లప్పరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికే పల్లె పండుగ


ఉల్లారంపల్లెలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. మంగళవారం పొలకల, మొరుంపల్లె, పుత్రమద్ది, 35యర్లంపల్లె, బొమ్మసముద్రం పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలకల పంచాయతీ ఉల్లారంపల్లెలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలతో సంబంధం లేకుండా అభివృద్ధి పనులు చేస్తామని స్పష్టం చేశారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్. రాజన్, మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, జడ్పీటీసీ సుచిత్ర, నాయకులు బత్తలసురేంద్రనాయుడు, హరిబాబునాయుడు,కొల్లారమేష్, ధనంజయనాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, దిలీప్, లోకనాథరెడ్డి, దేవాజీ, ధరణి, రుష్యేంద్రనాయుడు, లత, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే గ్రామాల అభివృద్ధి: టీడీపీ


రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న రవి

వెదురుకుప్పం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలోనే గ్రామాల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టీడీపీ ఎస్సీ సెల్ జీడీనెల్లూరు ఉపాధ్యక్షుడు బీఎం రవి అన్నారు. మంగళవారం వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ కొండకిందపల్లె గ్రామంలో 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. టీడీపీ నాయకులు శంకరయ్య, మొగిలయ్య, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వేగ నిరోధకాలెక్కడ?

గుడిపాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుడిపాల బస్టాప్ వద్ద వేగ నిరోధకాలు లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సమీపంలోనే తహసీల్దార్, ఎంపీడీవో, పాఠశాల, వ్యవసాయ, సింగిల్ విండో, విద్యాశాఖ కార్యాలయాలతోపాటు గ్రంథాలయం, పీహెచ్‌సీ ఉండడంతో అధిక సంఖ్యలో ఈ మార్గంలో జనం రాకపోకలు సాగిస్తుంటారు. మరోవైపు హైవే పనుల కారణంగా వన్ వే విధించారు. ఈ పరిస్థితుల్లో ఇక్కడికొచ్చేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. మంగళవారం కూడా ఓ పాదచారుడిని కారు ఢీకొంది.

బంగారమ్మకు పూజలు



వెదురుకుప్పం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు రంగనాథమొదలియార్ పర్యవేక్షించారు.

అప్రమత్తంగా ఉండండి

● చెరువులు, కాలువలను పరిశీలించిన కమిషనర్




బుడమాల చెరువును పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్ - పద్మసరస్సును పరిశీలిస్తున్న కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి - కార్వేటినగరంలో చెరువును పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ చెప్పారు. వర్షాల ప్రభావంతో మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. నగర శివారులోని బుడమాల చెరువును తనిఖీ చేశారు. భారీ వర్షాలు వస్తే చెరువు నుంచి నివాసప్రాంతాలకు నీరు చేరకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గతంలో వర్షపునీరు చేరిన లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన ముందస్తు చర్యలపై అధికారులతో చర్చించారు. చిన్న, పెద్ద కాలువలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమాచారం ఇవ్వాలన్నారు. నీవానది పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇబ్బందులెదురైతే నగరపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబరు 984990788కు సమాచారం ఇవ్వాలన్నారు.

వాగులు, వంకలవైపు వెళ్లొద్దు

వెదురుకుప్పం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేని వాన కురుస్తోందని, ప్రజలు ఎవరూ వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయరాదని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వీలైనంతవరకు ఇళ్లలోనే ఉండాలని కోరారు.

కూలీలకు ఇబ్బందులు: కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లో మంగళవారం ఎడతెరపి లేని వాన కురిసింది. దీంతో రోజువారీ కూలీ పనులకు వెళ్లేవారు ఇబ్బంది పడ్డారు.

చెరువుల తనిఖీ

వెదురుకుప్పం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో కార్వేటినగరం మండల పరిధిలో పలు చెరువులను మంగళవారం ఎంపీడీవో చంద్రమౌళి బృందం తనిఖీ చేసింది. చెరువు కట్టకు గండి పడే పరిస్థితులున్నాయా? తదితరాలపై ఆరా తీశారు.

శిథిలావస్థలోని ఇళ్లలో నివాసం ఉండొద్దు: శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండొద్దని చంద్రమౌళి సూచించారు. చాకలివానిగుంట ఎస్టీ కాలనీ, పద్మసరస్సు ఎస్టీ కాలనీల్లో పర్యటించారు. ఈవో జి.నాగరత్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండండి

గుడిపాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ సందర్భంగా మండలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో శివరాజ్ అన్నారు. సచివాలయ ఉద్యోగులు సెలవులు పెట్టకుండా అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు.

సాయం చేస్తాం : వర్షాలకు ఎక్కడైనా నిరుపేదలు ఇల్లు కోల్పోతే జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయం చేస్తామని నిర్వాహకుడు గురజాల చెన్నకేశవులు మీడియాకు తెలిపారు. ఆయనవెంట తెలుగు యువత అధికార రాష్ట్ర ప్రతినిధి హేమాద్రి నాయుడు, టీడీపీ నేత అయ్యప్ప తదితరులు ఉన్నారు.

బురదతో నిండిన అంతర్రాష్ట్ర రహదారి

యాదమరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి బురదతో నిండిపోయింది. దీనివల్ల మంగళవారం పలువురు జారిపడి గాయాలపాలయ్యారు.

పొలాల్లోకి చేరిన వర్షపునీరు

విజయపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు కురిసిన వానతో పొలాల్లోకి నీరు చేరింది. చెరకు కర్మాగారాలు పర్మిట్ రద్దు చేయడంతో వర్షంలోనే చెరకు పంట తడుస్తూ ఉండిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద నగరి - కనకమ్మసత్రం తారురోడ్డు జలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ● ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్ పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలవారు సురక్షితమైన ప్రదేశాలకు చేరుకోవాలని సూచించారు. ఇబ్బందులెదురైతే 94910 77035 నెంబరును సంప్రదించాలన్నారు.



యాదమరి: కన్నికాపురం చెక్‌పోస్టు సమీపంలో బురదతో నిండిన రహదారి - విజయపురం: గొల్లకండ్రిగ వద్ద వర్షపు నీటిలో ఉద్దిపంట


నగరిపేట బీసీ కాలనీలో అధికారులు

లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు

నగరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్, పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో మంగళవారం మున్సిపల్ అధికారులు, తహసీల్దార్ పర్యటించారు. ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నగరిపేట, బీసీ కాలనీ, లింగేష్ గుంట, చింతలపట్టెడ దళితవాడ ప్రాంతాలవాసులను అప్రమత్తంగా చేశారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సూచనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. తహసీల్దార్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


కూలీలకు కూరగాయల వితరణ



నింద్ర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పాదిరి ఆది ఆంధ్రవాడలోని కూలీలకు స్థానిక టీడీపీ యువనాయకుడు నంద మంగళవారం కూరగాయలను వితరణ చేశారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు పనుల్లేక కూలీలు ఇబ్బంది పడుతుండటంతో వీటిని అందజేశామన్నారు.

తాగి వాహనాలు నడిపిన 21 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి జరిమానా విధించారు. సోమవారం ట్రాఫిక్ సీఐ నిత్యబాబు సిబ్బందితో కలిసి నగరంలో వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. 21 మంది మద్యం తాగి పట్టుబడగా వీరిని మంగళవారం చిత్తూరులోని సివిల్ కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు ప్రవేశపెట్టారు. విచారించిన న్యాయమూర్తి.. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ.2.10 లక్షల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.



వార్డు మెంబర్లకు శిక్షణ ప్రారంభం

వెదురుకుప్పం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు రెండు రోజుల శిక్షణ తరగతులను ఎంపీడీవో చంద్రమౌళి ప్రారంభించారు. ఈవో జి.నాగరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజయపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులకు శిక్షణను మంగళవారం ఎంపీడీవో రమణప్రకాష్ ప్రారంభించారు. ఎడతెరపి లేని వర్షం, సభ్యులకు సరైన సమాచారం అందక పోవడంతో శిక్షణ నామమాత్రంగా నిర్వహించారు. 75 మందికిగాను తొమ్మిది మందే హాజరయ్యారు. ఈవోపీఆర్డీ సురేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ సిలిండర్ల కోసం తిప్పలు

నగరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదు. వాహనం వద్దకే పుస్తకాలు తీసుకెళితే వారేఓటీపీ వారే చూసుకుంటారులే అంటూ క్యూ కడుతున్నారు. మంగళవారం కొండచుట్టు మండపం వద్ద వర్షంలోనూ సిలిండర్లు క్యూలో పెట్టి వినియోగదారులు వేచి ఉండాల్సి వచ్చింది.

చెరకు బకాయిలు చెల్లించే వరకు పోరాటం


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, నాయకులు

నింద్ర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు చెల్లించాల్సిన చెరకు బకాయిలు రూ.36కోట్లు చెల్లించేవరకు పోరాటం చేస్తామని రైతు సంఘ నాయకులు తెలిపారు. ఎస్‌టీసీ ఫైనాన్స్ కంపెనీ వారు నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ వేలం ప్రక్రియ మంగళవారం జరుగుతుందని తెలుసుకుని చెరకు రైతులు, కార్మికులు ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. రైతులు, కార్మికులు మాట్లాడుతూ.. తమకు బకాయిలు చెల్లించి, ఫ్యాక్టరీని వేలం వేసుకోవాలని చెప్పారు. ఫైనాన్స్ కంపెనీతో కలెక్టర్, ఏసీసీ మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గుడిపాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు- వేలూరు జాతీయ రహదారిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చిత్తూరు రూరల్ మండలం నరిగపల్లెకి చెందిన నరేంద్ర స్కూటీలో గుడిపాల నుంచి చిత్తూరు వైపు వస్తుండగా, మార్గమధ్యంలోని కొత్తపల్లె సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామ్మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని రామాపురం సీఎంసీకి తరలించారు.

సాయిబాబాకు క్షీరాభిషేకం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి విశ్వసాయి షిరిడీ సాయిబాబా ఆలయంలోని బాబా విగ్రహానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. బాబా మహాసమాధి అయిన రోజు సందర్భంగా భక్తులే స్వయంగా అభిషేకం చేశారని నిర్వాహకులు తెలిపారు. ఆలయ ట్రస్టీ సీకే బాబు దంపతులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని బాబా ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

నేడు మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ

మహావీర్ బ్రిడ్జి జీవ కారుణ్య అన్నదాన సమాజం భూముల్లోని అమృత మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, మహా సంప్రోక్షణ కార్యక్రమాలు బుధవారం నిర్వహిస్తున్నట్లు దేవదాయశాఖ అధికారులు, భక్తులు తెలిపారు. నగరవాసులు పాల్గొనాలని కోరారు.



అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుంటాం: ఆర్డీవో


వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో శ్రీనివాసులు

శ్రీరంగరాజపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని ఆర్డీవో ఎన్.శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని 49.కొత్తపల్లెమిట్ట చెందిన హేమాద్రి తన పొలానికి వెళ్లే దారిని ఆక్రమించారని కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన అర్జీపై మంగళవారం ఆర్డీవో విచారణ చేపట్టారు. క్షేత్రస్థాయిలో ఆక్రమణ ఏమీ లేదని గుర్తించారు. అయితే ఈ పొలం పక్కనే ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణకు గురైనట్లు తేలడంతో పరిశీలించి నివేదిక ఇవ్వాలని వీఆర్వో, సర్వేయర్‌ను ఆదేశించారు. అలాగే హేమాద్రికి చెందిన పొలం డీకేటీ భూమి అని, అందులో లేవుట్‌కు ఎలా అనుమతిచ్చారని, దీనిపైనా విచారించాలని చెప్పారు. అనంతరం వర్షాల నేపథ్యంలో క్షీరసముద్రం వాగును, పుల్లూరు పెద్ద చెరువును పరిశీలించారు. తహసీల్దార్ లోకనాథం పిళ్లై, సర్పంచ్ డి.వి.డిల్లెయ్య, సీనియర్ అసిస్టెంట్ హమీద్ బాషా, ఆర్ఐ గోపి, వీఆర్వో రవి, సర్వేయర్ తులసి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం


థామస్‌ను సన్మానిస్తున్న చిట్టిబాబునాయుడు

పాలసముద్రం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్‌థామస్, టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు తెలిపారు. మంగళవారం చెన్నైలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఇరువురు నాయకులు కలసి చర్చలు జరిపారు. కొంతకాలంగా వీరిమధ్య విభేదాలున్నాయని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ క్రమంలో పార్టీ శ్రేణులకు అండగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించుకున్నారు. టీడీపీ నాయకులు గుండయ్య, వాసునాయుడు పాల్గొన్నారు.

అంధులను ఆదుకుందాం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అంధులను ఆదుకుందామని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు పిలుపునిచ్చారు. మంగళవారం అంధుల సమాఖ్య చిత్తూరు యూనిట్ సభ్యుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ తెల్లకర్రల దినోత్సవాన్ని గాంధీ విగ్రహం వద్ద నిర్వహించారు. సంఘ ప్రధాన కార్యదర్శి భూపతి, సభ్యులు పాల్గొన్నారు.

జీతాల కోసం కార్మికుల నిరసన

చితూరు సెంట్రల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీతాలు సకాలంలో చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలో నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ నాయకులు దాసరి చంద్ర, మణికంఠ, దామోదరం, శంకర్ తదితరులు మాట్లాడుతూ.. ప్రతినెలా జీతాలు ఆలస్యంగా ఇవ్వడంతో కుటుంబపోషణ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.86వేల విరాళం




చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం రూ.86,100 విరాళాన్ని అందజేసింది. మంగళవారం సంఘ నాయకులు కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను అందజేశారు. డీఈవో దేవరాజులు, చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్, జిల్లా సంఘ అధ్యక్షుడు బి.అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రవీంద్రారెడ్డి, కోశాధికారి హేమాద్రి, రాష్ట్ర కౌన్సిలర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.36వేల విరాళం



చిత్తూరు అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వరద బాధితుల సహాయార్థం విశ్రాంత పోలీసు అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.36వేలను విరాళంగా ఇచ్చారు. మంగళవారం ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను ఎస్పీ మణికంఠకు అందించారు. అసోసియేషన్ సభ్యులు ఫెడ్రిక్, మురళి తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మకు శాంతి పూజలు



చిత్తూరు కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుర్రప్పనాయుడు వీధి అంకాల పరమేశ్వరి అమ్మవారికి మంగళవారం శాంతి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని రాజారాజేశ్వరిగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు.